# కళ్ళు

నందిగం శ్రీనివాసులు



అప్పుడే స్నానం చేసి ముగించుకొని వచ్చిన భుజంగరావుకు బయటికి విన్పించేలా ఏదో సణుక్కుంటూ భోజనం వడ్డించింది. ఆయన సతీమణి కామేశ్వరమ్మ. బి.ఏ. ఫైనల్ చదువుతున్న రంజని వాళ్ళ ఏకైక సంతానం. ఎదుగూ. బొదుగూ లేకుండా సాఫీగా గడిచిపోతూ ఉన్నా కామేశ్వరమ్మ తను పొందలేనిది ఎదుటి వాళ్ళెవరైనా పొందుతూ ఉంటే ఉడుక్కునే స్వభావం గలది. ఉన్న ఒక్క కూతురి అచ్చటా ముచ్చటా ఘనంగా తీర్చాలని దానికోసం ఎన్ని అడ్డదార్లు తొక్కినా ఫర్వాలేదని సలహాలిచ్చినా నిజాయితీగా బ్రతకాలనే సిద్ధాంతం గల భుజంగరావ్ ఆమె బోధలను పెడచెవిన పెట్టేవాడు.

తన సణుగుడు ఏ మాత్రం పట్టించుకోకుండా నిశ్చింతగా భోంచేస్తున్న భర్తను చూస్తుంటే ఉక్రోషం ముంచుకొచ్చింది కామేశ్వరమ్మకు.

"ఎదురింటి లక్ష్మీపతిగారు వాళ్ళావిడకా హాటి వాళ్ళమ్మాయిలకు చెరొకటి రవ్వల నెక్లెస్‌లు చేయించారట"

ఆ అనటంలో వెటకారమూ మీరూ ఉన్నారు ఎందుకూ! అని భర్త చేతకాని తనాన్ని ఎత్తిచూపుతున్నట్లుంది.

"అన్నట్లు ఈ వారం మయూరి వార పత్రికలో ఆ రచయిత ఎవరోగానీ-అచ్చం నీలాంటి మన స్తత్వం గల పాత్రనోదాన్ని తీసికొని కథ రాశాడు బెడ్ రూంలో పెట్టాను చదువు" అని ముసి ముసిగా నవ్వుకుంటూ భోంచేయటంలో లీనమయ్యాడు భుజంగరావు మాట మారుస్తున్న భర్త ధోరణిని అసహ్యించుకొంది కామేశ్వరమ్మ.

కండువా చేత్తో తీసికొని కామేశ్వరమ్మను పిలిచాడు భుజంగరావు. భుజం మీద తడుతూ అన్నాడు. "గతంలో నీకెన్నో సార్లు చెప్పాను అందని దానికి అర్రులుచాచటం మంచిదికాదని! అమలాపురంలో టెండర్లు పాడటానికి వెళుతున్నా. నాల్రోజుల్లో తిరిగొస్తా!" భుజంగరావు చెరగని నవ్వు ముఖం మీద విలాస మాడుతుండగా బయల్దేరాడు.

వీధి తలుపులు వేయబోయి తలవని తలంపుగా ఎదురింట్లోకి చూసింది కామేశ్వరమ్మ. లక్ష్మీపతిగారు ఫ్యామిలీతో ఎక్కడికో బయలు దేరుతున్నట్లుంది. ఆయన భార్య మెళ్ళో రవ్వల నక్లెస్ భగభగా మెరిసి పోతుంటే కామేశ్వరమ్మ తననెవరో వెక్కిరిస్తున్నట్లు ఫీలయింది. అగ్నికి ఆజ్యం పోసినట్లు అపుడే అన్న భర్త మాటలు గుర్తుకొచ్చాయి. విసురుగా తలుపులేసింది.

బీరువా తెరిచి అందులో కేష్ నంతా లెక్కపెట్టింది. "టెండర్లకనీ.... పార్టీలకనీ ఈ పదివేలు తగిలేసినా తగిలేస్తారు. ఆయన రాక మునుపే బంగారు గాజులు చేయించాలి" అనుకొంది.

ఆమెకు ఏదో తీరని వెలితి, బెడ్‌పై బోర్లా పడుకొని బలవంతంగా .... లక్ష్మీపతిగారిని ఆయన ఫేమిలీని ఎవరో దొంగలు దారిలో అటకాయించి. నగలన్నీ లాక్కున్నట్లు.... వాళ్ళు బజారున పడ్డట్లు.... ఇంకా ఏదో ఏదో కల కనటం మొదలెట్టింది. ఆమెకు తెలీకుండానే నిద్ర పట్టేసింది.

"ఇంత బండ నిద్రేంటే! కనీసం తలుపులయినా వేసుకోకుండా!" అంటూ అపుడే ఎక్స్‌కర్షన్ నుండి తిరిగొచ్చిన కూతురి మాటలతో ఉలిక్కిపడి లేచింది కామేశ్వరమ్మ.

ఎదురుగా.... బోసిగా.... నవ్వుతున్న బీరువాను చూసి ఘొల్లుమంది కామేశ్వరమ్మ●